

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషు లందరికీ విజయదశమి శుభాకాంక్షలు.
తమిళనాట విజయదశమి బుధవారం, తెలుగు రాష్ట్రాల్లో గురువారం జరుగుతున్నందున ఆ రెండు రోజుల్లోనూ ఆంధ్రజ్యోతి చెన్నై కార్యాలయం పని చేయదు. అందువల్ల 2, 3 తేదీల్లో ఆంధ్రజ్యోతి తమిళనాడు సంచిక వెలువడదు.
పునర్దర్శనం శనివారం.

రగులుతున్న కరూర్

● విమర్శలు, ప్రతివిమర్శలు - అరెస్టులు, ఆగ్రహావేశాలు ● ఇంకా చల్లారని తొక్కిసలాట పర్యవసానం

● వాస్తవాలు తెలుసుకుందాం రండి : విజయ్‌కి బీజేపీ ఎంపీల బృందం ఆహ్వానం

ఇటీవల 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత విజయ్ కరూర్ పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతి చెందగా, పలువురు గాయపడిన వ్యవహారం రాష్ట్రంలో ఇంకా నిప్పు రాజేస్తూనే వుంది. ఈ దుర్ఘటన ద్వారా లబ్ధి పొందేందుకు అన్ని పార్టీలు వ్యూహ, ప్రతివ్యూహాలు పన్నుతుండడంతో మరిన్ని కొత్త వివాదాలకు కారణమవుతోంది. ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని టీవీకే ఆరోపిస్తుండగా, ఆ పార్టీ ఉద్దేశపూర్వక ఆలస్యమే అసలు కారణమని అధికార పార్టీ ఆరోపిస్తుంది. దీంతో విమర్శలు, ప్రతి విమర్శలు, ఘటనకు కారణమైన వారుగా భావిస్తున్న వ్యక్తుల అరెస్టులు, దీనిపై ఆగ్రహావేశాలతో యావత్ రాష్ట్రం ఒకరకమైన ఉక్కపోతకు గురవుతోంది. మరోవైపు ఈ ఘటనపై నిజానిజాలు తెలుసుకునేందుకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఏర్పాటు చేసిన ఎనిమిది మంది ఎంపీల బృందం మంగళవారం కరూర్ వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి, మృతుల కుటుంబాలను ఓదార్చింది. ఈ మొత్తం వ్యవహారంలో ఎప్పుడు ఏ కొత్త విషయం వెలుగులోకి వస్తుందోన్న ఉత్కంఠ ఉక్కిరిబిక్కిరి చేస్తోంది.

- చెన్నై, ఆంధ్రజ్యోతి

టీవీకే నాయకులకు 14వ తేది వరకు రిమాండ్

కరూర్ విషాద ఘటనకు సంబంధించి పోలీసులు అరెస్ట్ చేసిన టీవీకే కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మదియళగన్, పౌన్‌రాజ్‌లకు 15 రోజుల పాటు రిమాండ్ విధిస్తూ కరూరు కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యవహారంలో ఏ పత్రాలనూ అంగీకరించలేమని, తన మనస్సాక్షి ఆధారంగా ఉత్తర్వులు జారీచేస్తున్నట్లు ఈ సందర్భంగా న్యాయమూర్తి వ్యాఖ్యానించారు.

ముందస్తు బెయిలుకు బుస్సీ ఆనంద్, నిర్మల్ కుమార్

కరూర్ ఘటనలో ముందస్తు బెయిలు కోరుతూ టీవీకే ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్ మద్రాసు హైకోర్టులో మంగళవారం పిటిషన్లు దాఖలుచేశారు. కరూర్ సభలో జరిగిన తొక్కిసలాట ఘటనకూ, తమకు ఎలాంటి సంబంధం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేగాక పోలీసుశాఖ తమ బాధ్యతలను పూర్తిగా విస్మరించిందని, ప్రభుత్వ యంత్రాంగం తప్పులు దాచిపెట్టి, తమపై కేసు నమోదుచేసిందని ఆరోపించారు.

ప్రమాదానికి గురైన ఎంపీ హేమమాలిని కారు

కరూర్ దుర్ఘటనకు దారితీసిన పరిస్థితులు తెలుసుకునేందుకు ఎంపీ హేమమాలిని నేతృత్వంలో 8 మంది ఎంపీల బృందం మంగళవారం ఉదయం ఢిల్లీ నుంచి కోయంబత్తూరు చేరుకుని, అక్కడి నుంచి కారులో ఘటనా స్థలికి బయలుదేరింది. మార్గమధ్యంలో ఎంపీల కార్లు ఒకదాని వెంట మరొకటి వెళ్తూ ఢీకొన్నాయి. ఈ ఘటనలో హేమమాలిని ప్రయాణిస్తున్న కారు ముందు భాగం దెబ్బతింది. అయితే అదృష్టవశాత్తు ఎవ్వరికీ ఎలాంటి గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

అసత్య వార్తలు పోస్ట్ చేసిన ముగ్గురికి రిమాండ్

కరూర్ ఘటనపై సామాజిక మాధ్యమాల్లో అసత్య కథనాలు పోస్ట్ చేశారంటూ 25 మందిపై చెన్నై సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదుచేశారు. వారిలో పెరుంబాక్కంకు చెందిన బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సహాయం (38), టీవీకే సభ్యుడు మాంగాడుకు చెందిన శివనేశ్వరన్ (36), టీవీకే నాయకుడు ఆవడికి చెందిన శరత్‌కుమార్ (32)లను పోలీసులు సోమవారం అరెస్ట్ చేసి, మిగిలిన 22 మంది కోసం గాలిస్తున్నారు. అరెస్ట్ చేసిన ముగ్గురిని చెన్నై కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 15 రోజుల రిమాండ్ విధించడంతో వారిని చెంగల్పట్టు జైలుకు తరలించారు.

తాత్కాలికంగా ప్రచారం వాయిదా: టీవీకే

విజయ్ పర్యటన కోసం స్థలాలను ఎంపిక చేయాలంటూ పోలీసులకు వినతి పత్రాలను ఇవ్వడాన్ని వాయిదా వేసుకోవాలని టీవీకే నేతలకు విజ్ఞప్తి చేసింది. నిజానికి విజయ్ తదుపరి ప్రచారం ఈ నెల 4న వేలూరు, రాణీపేట జిల్లాల్లో జరగాల్సివుంది. ఇందుకోసం ఆయా జిల్లాల నేతలు పోలీసుల అనుమతి కోరుతూ లేఖలు ఇవ్వాల్సివుంది. అయితే ఆ వ్యవహారాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని టీవీకే సూచించింది.

ఆదవ్ అర్జునన్‌పై కేసు నమోదు...

'విప్లవం సృష్టించాలంటూ' సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన టీవీకే నిర్వాహకుడు ఆదవ్ అర్జునన్‌పై పోలీసులు కేసు నమోదుచేశారు. కరూరు విషాదం జరిగిన మూడు రోజుల తర్వాత ఆదవ్ అర్జున తన ఎక్స్ పేజీలో.... 'రోడ్డు మీద నడుచుకుంటూ వెళ్తుంటే కొడతారు... సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తేనే అరెస్ట్ చేస్తారు. పోలీసులు పాలక వర్గానికి సేవకులుగా మారితే, వారిని సరిచేసే మార్గం యువత విప్లవం ద్వారానే సాధ్యం. ప్రస్తుత యువత కలసి అధికారులకు వ్యతిరేకంగా విప్లవం సృష్టించి చూపాలి. యువత తిరుగుబాటు చేయాలి. ఆ తిరుగుబాటు పాలన మార్పునకు, అధికార పాలకుల అంతానికి పునాది అవుతుంది. దెయ్యాల పాలనలో శవాలు పీక్కుతింటాయి' అని పోస్ట్ చేశారు. ఈ పోస్ట్‌పై తీవ్ర విమర్శలు రావడంతో కొద్దిసేపటికి ఆయన తన పోస్ట్ తొలగించారు. ఈ వ్యవహారంలో ఆదవ్ అర్జునపై చెన్నై కేంద్ర నేరవిభాగం పోలీసులు కేసు నమోదు చేశారు.



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎంపీల బృందం

వాస్తవాలు తెలియాలి : బీజేపీ

కరూర్ విషాదంపై ఎంపీల బృందంతో కలసి వాస్తవాలు తెలుసుకునేందుకు రావాలని టీవీకే అధినేత విజయ్ బీజేపీ ఆహ్వానించింది. ఘటనకు దారితీసిన పరిస్థితులను క్షుణ్ణంగా తెలుసుకునేలా బీజేపీ ఎంపీ హేమమాలిని నేతృత్వంలో 8 మంది ఎంపీల బృందం కరూర్ పర్యటిస్తోందని, ఈ బృందంతో విజయ్ మాట్లాడాలని బీజేపీ నేత ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. న్యాయం జరిగే వరకు బృందానికి మద్దతుగా ఉండాలని కోరారు. ఈ ఘటనకు సంబంధించిన ఆధారాలు, పూర్తి వివరాలు సేకరించి మృతిచెందిన 41 మందికి న్యాయం జరిగేలా విజయ్ సహకరించాలన్నారు. ఈ ఘటనపై వాస్తవాలు ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత పార్టీ అధ్యక్షుడిగా విజయ్‌కు ఉందని తెలిపారు. అందువల్ల రాజకీయాలకు అతీతంగా, దేశ సంక్షేమం, ప్రజల భద్రత కల్పించేలా విజయ్ ఎంపీల బృందంతో కలసి పనిచేయాలని సూచించారు.

యువకుల మృతి కన్నీరు తెప్పించింది మంత్రి అన్బిల్ మహేష్

కరూర్ ఘటన సంభవించిన వెంటనే మంత్రిగా తాను ఆ ప్రాంతానికి వెళ్లడంపై పలువురు విమర్శిస్తున్నారని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ విచారం వ్యక్తం చేశారు. శనివారం రాత్రి నాగపట్టణం నుంచి వస్తున్న సమయంలో తనకు కరూర్ విషాదం తెలిసిందని, రాత్రి 10 గంటలకు తాను కరూర్ చేరుకున్నానని తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న అంతమంది విద్యార్థులను స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్లడాన్ని చూసి స్ట్రెచ్చర్‌పై తీసుకెళ్తుండడాన్ని చూసి ఎవరికైనా మనసు ద్రవిస్తుందన్నారు.

అడిగిన దానికంటే అదనపు భద్రత

● విద్యుత్ సరఫరా ఆపలేదు ● అనుమతికి మించి భారీగా జనం

● మీడియా సమావేశంలో ఉన్నతాధికారులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

చెన్నై, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో టీవీకే అధినేత విజయ్ ప్రచారం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సరైన భద్రత కల్పించలేదని, విద్యుత్ సరఫరాను నిలిపేశారని, ఉద్దేశపూర్వకంగా ప్రచారమార్గంలో అంబులెన్సులను నడిపారంటూ వస్తున్న విమర్శలకు ప్రభుత్వ ఉన్నతాధికారులు సమాధానం చెప్పారు. సచివాలయంలో మంగళవారం ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అముద, ఆరోగ్యశాఖ కార్యదర్శి సెంథిల్‌కుమార్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సామాజిక మాధ్యమాల్లో రేగుతున్న ప్రతి సందేహానికి వారు వీడియో ఆధారంగా సమాధానాలిచ్చారు.

అదనపు భద్రత ఏర్పాటు చేశాం

టీవీకే నిర్వాహకులు విజయ్ ప్రచారానికి 10 వేల మంది వస్తారని పోలీసులకు చెప్పి అనుమతి పొందారని, అయితే గతంలో ఆయన సభలకు వచ్చిన జనాన్ని బట్టి తాము 20 వేల మంది వస్తారని ఊహించి పోలీసు భద్రత కల్పించామని పేర్కొన్నారు. సాధారణంగా 50 మందికి ఒక పోలీసు చొప్పున ఏర్పాటు చేస్తామని, కానీ కరూర్‌లో 20 మందికి ఒక పోలీసు చొప్పున నియమించామన్నారు. ఆ సభకు సుమారు 27,000 మంది హాజరయ్యారన్నారు. పోలీసులు లేకపోతే తాను ఇక్కడకు రాలేనని సాక్షాత్తు విజయే ఆ రోజు సభలో ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తుచేశారు. పార్టీ అధ్యక్షుడి వెంట వచ్చిన కార్యకర్తలు, అప్పటికే సభ జరిగే ప్రాంతంలో వున్న అధిక ప్రజల కారణంగా రద్దీ ఏర్పడిందని వివరించారు. విజయ్ వాహనానికి దారిచ్చే సమయంలో రద్దీ మరింత అధికమైందన్నారు. విజయ్ ప్రచార వాహనాన్ని ఆపాలని అక్కడున్న పోలీసు అధికారులు కోరారని, అందుకు అంగీకరించలేదన్నారు. ప్రచారంలో విజయ్ మాట్లాడుతున్న సమయంలో కరెంటు ఆపలేదన్నారు. జనరేటర్ రూమ్‌లోకి పెద్దసంఖ్యలో ప్రజలు చొరబడడంతో ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా ఆ ప్రాంతంలో మాత్రమే విద్యుత్ సరఫరా నిలిపివేశామన్నారు. ప్రజలు ఉదయం నుంచే అక్కడ వేచి ఉన్నారని, వారికి కనీసం మంచి నీరు కూడా అందలేదని వివరించారు.

అంబులెన్స్‌లు టీవీకే ఏర్పాటు చేసినవే...

కరూర్ ఘటన జరిగిన కొద్ది సేపటికే అన్ని అంబులెన్స్‌లు ఎలా వచ్చాయనే అనుమానాలకు కూడా అధికారులు సమాధానం ఇచ్చారు. "కరూర్ సభకు టీవీకే వారే 5 అంబులెన్స్‌లు ఏర్పాటుచేశారు. విజయ్ వచ్చిన తర్వాత మరో రెండు అంబులెన్స్‌లు వచ్చాయి. ప్రభుత్వానికి చెందిన ఆరు అంబులెన్స్‌లు వివిధ ప్రాంతాల్లో ఉంచాం. ప్రమాదం జరిగిందనే సమాచారం అందగానే వాటిని కూడా అక్కడకు పంపించాం. ప్రభుత్వ అంబులెన్స్‌ల కన్నా టీవీకే సిద్ధం చేసిన అంబులెన్స్‌లే ఘటనా స్థలికి ముందుగా వెళ్లాయి. తొలి పిలుపు 7.15 గంటలకు వచ్చిన నేపథ్యంలో, రెండో పిలుపుతో 7.23 గంటలకు అంబులెన్స్‌లు పంపాం. రాత్రి 7.45 నుంచి 9.45 గంటల వరకు వరుసగా అంబులెన్స్‌ల ద్వారా బాధితులను తరలిస్తూనే వున్నాం" అని వివరించారు.

రాత్రి సమయంలో పోస్టుమార్టం ?

కరూర్ ప్రభుత్వాసుపత్రిలో 28 మృతదేహాలు ఉంచేందుకే అవకాశం ఉందని ఆరోగ్యశాఖ కార్యదర్శి తెలిపారు. స్థలాభావం కారణంగా, త్వరత్వరగా మృతదేహాలు అప్పగించాలని భావించి రాత్రి సమయంలో పోస్టుమార్టం నిర్వహించామని, బంధువులు కోరిక మేరకే మృతదేహాలను వెంటనే అప్పగించామని వారు స్పష్టం చేశారు.



ఫ్లై ఓవర్‌పై నడిచివెళ్తున్న సీఎం స్టాలిన్, జీసీసీ మేయర్, మంత్రులు అధికారులు

టి.నగర్ ఫ్లైఓవర్ ప్రారంభం

● రూ.165 కోట్లతో నిర్మాణం

● వంతెన మీదుగా నడిచి పరిశీలించిన సీఎం

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ ఉస్మాన్ రోడ్డులో రూ.165 కోట్లతో నిర్మించిన ఫ్లై ఓవర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం ప్రారంభించారు. నగరంలో ప్రధాన వాణిజ్య ప్రాంతమైన టి.నగర్‌లో ప్రముఖ వస్త్ర, నగల సహా పలు దుకాణాలుండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఈ ప్రాంతంలో రద్దీ నియంత్రించేలా ఇదివరకు ఉస్మాన్ రోడ్డులో ఫ్లై ఓవర్ అందుబాటులో ఉంది. ఈ ఫ్లైవర్ రంగనాథన్ వీధి సమీపంలో ముగుస్తుండడంతో ట్రాఫిక్ రద్దీ పెరిగింది. ఈ సమస్య నియంత్రించేలా ఉస్మాన్ రోడ్డు నుంచి సీఐటీ నగర్ మెయిన్ రోడ్డు వరకు 1.2 కి.మీ మేర కొత్త ఫ్లై ఓవర్ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. అదే సమయంలో, రంగనాథన్ రోడ్డు నుంచి టి.నగర్ బస్టాండ్ దాటి ఫ్లై ఓవర్ వెళ్లేలా రూపకల్పన చేశారు. ఉస్మాన్ రోడ్డులో ఇదివరకే ఉన్న 800 మీటర్ల పొడవున్న కాంక్రీట్ ఫ్లై ఓవర్‌ను ఈ ఫ్లై ఓవర్‌తో అనుసంధానం చేశారు. ఈ ఫ్లై ఓవర్‌ను మంగళవారం ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, ఎం.సుబ్రమణ్యం, శేఖర్‌బాబు, ఎంపీ ఎ.రాజా, మేయర్ ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్‌కు అన్బళగన్ పేరు...

టి.నగర్‌లో కొత్తగా ప్రారంభించిన ఫ్లై ఓవర్‌కు దివంగత మాజీ ఎమ్మెల్యే జె.అన్బళగన్ పేరు పెట్టారు. పళకడై జయరామన్ కుమారుడైన అన్బళగన్ చెన్నై పశ్చిమ జిల్లా కార్యదర్శిగా పని చేసి, పార్టీ నిర్వాహకులతో పాటు కార్యకర్తలు, ప్రజల మధ్య మంచి పేరు పొందారు.

సూర్య చంద్రులే వాహనాలుగా...





సూర్య, చంద్రప్రభ వాహనాలపై శ్రీనివాసుడి చిద్విలాసం

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక టి.నగర్ వెంకట నారాయణరోడ్డులోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 7వ రోజైన మంగళవారం ఉదయం యాగశాల పూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం శ్రీవారిని అలంకరించిన సూర్యప్రభపై కొలువుదీర్చి భక్తులను దర్శనానికి అనుమతించారు. సాయంత్రం 6.30 గంటలకు చంద్రప్రభపై అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారు ప్రత్యేక పూజలందుకున్నారు. టీటీడీ చెన్నై సలహామండలి మాజీ నిర్వాహకులు, సభ్యులు, భక్తులు స్వామివారిని సేవించారు. భక్తులకు ఆలయం తరుపున ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, బుధవారం ఉదయం రథోత్సవం, సాయంత్ర అశ్వవాహనసేవ, గురువారం ఉదయం చక్రస్నానం, సాయంత్రం శ్రీరామచంద్రమూర్తికి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించనున్నట్లు ఏఈవో కె.పార్థసారథి తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని, ప్రాంగణాన్ని అరటి, మామిడి తోరణాలు, బంతి, చామంతి, సంపంగి తదితర పూలు, విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు.

● దసరా వేడుకలు..

అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు



టి.నగర్‌లోని బెంగాల్ అసోసియేషన్ కార్యాలయంలో దుర్గా మాతకు పూజలు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపట్టే దసరా సందడి నెలకొంది. వాడవాడలా అమ్మవారి ఆలయాలు ప్రత్యేక పూజలతో వెలుస్తాబయ్యాయి. దసరా, శరన్నవరాత్రుల ఉత్సవాల్లో ప్రధానాంశమైన ఆయుధపూజను బుధవారం, గురువారం విజయదశమి పర్వదినాలను సంప్రదాయబద్ధంగా జరుపుకొనేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. బుధ, గురువారాలు సెలవు రోజులు కావడంతో ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణాల్లో మంగళవారం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. పండుగను పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా అమ్మవార్లు కొలువుదీరిన ఆలయాలను విశేషంగా అలంకరించారు. నగరంలో ప్రసిద్ధి చెందిన తిరువేర్కాడు శ్రీదేవి కరుమారియమ్మన్ ఆలయం, మాంగాడు కామాక్షి అమ్మవారి ఆలయం, ప్యారీస్ తంబుచెట్టివీధిలోని కాళికాంబళ్ ఆలయం, జార్జిటౌన్ శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానం, టీనగర్ జీఎన్‌చెట్టి రోడ్డులోని పద్మావతి తాయారు ఆలయం, బీసెంట్ నగర్ అష్టలక్ష్మీ అమ్మవారి ఆలయం, పెరియపాళయం సమీపంలో ఆర్యపాక్కంలోని ఉన్న శ్రీ విద్యారంభ జ్ఞానసరస్వతి ఆలయం, తిరువొత్తియూర్ వడివుడయమ్మన్ ఆలయం సహా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు సిద్ధం చేశారు.

పరిశ్రమల రంగంలో రాష్ట్రం అగ్రస్థానం

● పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా



హెచ్‌సీసీ వార్షికోత్సవాన్ని ప్రారంభిస్తున్న మంత్రి రాజా

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల రంగంలో రాష్ట్రంలో ముందంజలో వుందని, పరిశ్రమల ఏర్పాటు కు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని రాష్ట్ర పరిశ్రమ ల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా పేర్కొన్నారు. 'హిందుస్తాన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్' (హెచ్‌సీసీ) 80వ అధ్యక్షుడిగా దుగార్ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ ఛైర్మన్ రమేష్ దుగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం చెన్నైలో జరిగిన హెచ్‌సీసీ 80వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన టీఆర్‌బీ రాజా మాట్లాడుతూ.. హెచ్‌సీసీ దేశంలోని అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఛాంబర్లలో ఒకటి అని, 80వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు. రమేష్ దుగర్ మాట్లాడుతూ.. 'సంస్థ ద్వారా పురోగతి' అనే తమ నినాదాన్ని కార్యాచరణ ద్వారా ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నట్లు వివరించారు.

కళా నీరాజనం









కథాకళి.. 'గోవింద'రాజు

కనులు, కనుబొమ్మలు తిప్పుతూ, గాల్లో ఎగురుతూ, చక్కటి హావ భావాలతో 'కథాకళి' ప్రదర్శన ఇచ్చిన ఇతడి పేరు గోవిందరాజు. కేరళ రాష్ట్రం. బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. ఐపీఎస్ కావాలన్నది లక్ష్యం. దీనికోసం సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నారు. దీనికోసం



చిన్నప్పటి నుంచి ఎంతో మక్కువతో నేర్చుకున్న నృత్యానికీ కొంత దూరమయ్యారు. కానీ, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనకు అవకాశం రాగానే, అన్నిటినీ పక్కన పెట్టి తిరుమలకు చేరుకున్నారు. మంగళవారం రాత్రి చంద్రప్రభ వాహనం ముందు 'కథాకళి' ప్రదర్శనతో భక్తుల మనసు దోచుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమల గిరులు ఆటపాటలతో హోరెత్తి పోతున్నాయి. ఉదయం, సాయంత్రం వాహనసేవల్లో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళా బృందాల ప్రదర్శనలు భక్తులను తన్మయులను చేస్తున్నాయి. శాస్త్రీయ నృత్యాలు, జానపదాలు, పౌరాణిక వేషధారణలు.. ఎటు చూసినా అందమే! రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్నాటక, కేరళ, తమిళనాడు, మధ్యప్రదేశ్, జమ్మూకాశ్మీర్, గుజరాత్, మహారాష్ట్ర, ఒరిస్సా, ఛతీస్‌ఘడ్, పంజాబ్, మణిపూర్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్ ఇలా మొత్తం 28 రాష్ట్రాల నుంచి 6,960 మంది కళాకారులుఆడిపాడి అలరించారు. మంగళవారం పగలు సూర్యప్రభ వాహనం ముందు, రాత్రి చంద్రప్రభ వాహన సేవలో తొమ్మిది రాష్ట్రాలకు సంబంధించిన 21 బృందాల్లోని 491 మంది కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తాదుల మనస్సును దోచుకున్నారు.టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, ఎస్వీ సంగీత నృత్య కళాశాల, దాససాహిత్య ప్రాజెక్ట్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

- తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

- 28 రాష్ట్రాల నుంచి విచ్చేసిన కళాకారులు
- ఆధ్యాత్మికానందాన్ని పంచుతున్న ప్రదర్శనలు

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు.
కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వరరావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా 'జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్టు 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



సమాచార దర్శిని

3న విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో అక్టోబర్ 3వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. ఈ మేరకు మంగళవారం విద్యుత్ బోర్డు ఓ ప్రకటన విడుదల చేసింది.

పోరూర్..

కారంబాక్కం, కందస్వామినగర్, పొన్నినగర్, అరుణాచలం నగర్, పద్మావతి నగర్, కావేరినగర్, ధర్మరాజనగర్, విశ్వనాథన్ వీధి, బ్రాహ్మణ వీధుల్లో మరమ్మతులు పూర్తయ్యాక మధ్యాహ్నం 2 గంటలకు విద్యుత్ సరఫరా వుంటుంది.

రేపు మద్యం దుకాణాల మూసివేత

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గాంధీ జయంతి సందర్భంగా గురువారం మద్యం దుకాణాలు మూసివేయనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ విడుదల చేసిన ప్రకటనలో... గాంధీ జయంతి సందర్భంగా మద్యం దుకాణాలు (హోల్‌సేల్, రిటైల్), బార్లు, అనుమతి పొందిన రిసార్టుల్లో ఉన్న మద్యం దుకాణాలు మూసివేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు చేపడతామని కలెక్టర్ హెచ్చరించారు.

'గేట్' దరఖాస్తు గడువు పొడిగింపు

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఐఐటీ సహా కేంద్ర ఉన్నత విద్యా సంస్థల్లో పీజీ ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 'గేట్' జాతీయ అర్హత పరీక్షలో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఆన్‌లైన్ ద్వారా వచ్చే ఏడాది ఫిబ్రవరి 7,8,14,15 తేదీల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షకు దరఖాస్తు స్వీకరణ గత నెల 28వ తేది ముగియగా, అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ నెల 9వ తేది వరకు పొడిగించారు. అభ్యర్థులు https://gate2026.iitg.ac.in/ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తులు సమర్పించాలని ప్రకటన వెలువడింది.

తమిళ పండితులకు ప్రోత్సాహక వేతనం

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం తమిళ పండితులకు నెలకు రూ.8,000 ప్రోత్సాహక వేతనం అందజేస్తోంది. ఈ ప్రోత్సాహక వేతనం పొందేందుకు అర్హులైన వారు www.tamilvalarchithurai. tn. gov. in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తిచేసి, ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లోని మండల, జిల్లా తమిళ అభివృద్ధి శాఖ డైరెక్టర్, జిల్లా తమిళ అభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాల ద్వారా నవంబరు 17వ తేదీలోపు పంపించాలని, మరిన్ని వివరాలకు అదే వెబ్‌సైట్‌లో చూడాలని తమిళ అభివృద్ధి శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు 4 శాతం రిజర్వేషన్ కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే ప్రకటించింది. ఈ క్రమంలో, వారు పనిచేసేందుకు అనువైన పోస్టులతో సమాచారాన్ని మంగళవారం ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ ప్రకారం, ఏ,బి,సి,డి అనే నాలుగు విభాగాల్లో 119 పోస్టులు దివ్యాంగులకు అనుకూలమని ప్రభుత్వం జీవోలో పేర్కొంది.

3న రామనాథపురానికి సీఎం

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ ఈ నెల 3వ తేది రామనాథపురంలో పర్యటించనున్నారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో, రామనాథపురంలో ముఖ్యమంత్రి స్టాలిన్, గత నెల 29వ తేది పర్యటించాల్సి ఉంది. కరూరులో టీవీకే అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో 41 మంది మృతిచెందడంతో, సీఎం పర్యటన రద్దయింది. ఈ క్రమంలో, ఈ నెల 3న రామనాథపురం సమీపం పేరవూరులో జరిగే కార్యక్రమంలో పాల్గొనే సీఎం లబ్ధిదారులకు సంక్షేమ సహాయాలు అందజేయనున్నారు. దీనికోసం 2వ తేది రాత్రికే సీఎం రామనాథపురం చేరుకోనున్నారు. కాగా, కరూరు ఘటన కారణంగా, రామనాథపురంలో సీఎం స్టాలిన్ రోడ్ షో రద్దుచేసినట్లు, ఈ కార్యక్రమానికి బదులుగా సీఎం బసచేసే ప్రభుత్వ విడిదిగృహంలో జాలర్లు, వ్యాపారులు, రైతు సంఘాల ప్రతినిధులతో సీఎం సమావేశమవుతారని సచివాలయం తెలిపింది.

నైరుతి నిష్క్రమణ

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల మంగళవారం నిష్క్రమించినట్లు వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... ఈ ఏడాది నైరుతి రుతుపవనాల్లో సాధారణం కన్నా 1 శాతం తక్కువగా కురిసాయని తెలిపింది. అరియలూరు, చెంగల్పట్టు, చెన్నై, కోయంబత్తూర్, కడలూరు, మైలాడుదురై తదితర జిల్లాల్లో అధిక వర్షపాతం నమోదైందని పేర్కొంది. రాజధాని నగరం చెన్నైలో నైరుతి రుతుపవనాలతో సాధారణం కన్నా 29 శాతం అధికంగా వర్షపాతం నమోదైందని తెలిపింది. ఈ క్రమంలో, నైరుతి రుతుపవనాల వర్షపాతం వివరాల లెక్కింపు మంగళవారంతో ముగించి, బుధవారం నుంచి ఈశాన్య రుతుపవనాల వర్షపాతం లెక్కింపు చేపట్టనున్నట్లు వాతావరణ కేంద్రం తెలిపింది.

శాకంబరిగా సరస్వతీ దేవి

● రేపు ఆర్యపాక్కంలో ఉచితంగా అక్షరాభ్యాసం

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పెరియపాళయం సమీపంలోని ఆర్యపాక్కం గ్రామంలో అక్షరాభ్యాసతకు ప్రసిద్ధి గాంచిన విద్యారంభ జ్ఞాన సరస్వతి ఆలయంలో నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని మంగళవారం అమ్మవారు శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు..



షోడోషపూజలో ముత్తైదువులు



కూరగాయలు, పట్టు వస్త్రాల అలంకరణలో శాకంబరిగా సరస్వతిదేవి

ఉదయం 7 గంటలకు గోపూజ, 7.45 గంటలకు హోమం, 8 అభిషేకం, 8.30 గంటలకు కుంకుమార్చన, 9.15 గంటలకు మహాదీపారాధన పూజలను నిర్వహించారు. ఆలయ మహామండపంలో అమ్మవారు కూరగాయలు, పట్టువస్త్రాలు, ఆభరణాల అలంకరణతో దర్శనమిచ్చారు. అమ్మవారి మూలానక్షత్రం రోజు కావడంతో శాస్త్రోక్తంగా నిర్వహించిన నీలి సరస్వతి పూజల్లో పాల్గొన్న ముత్తైదువులను సంప్రదాయబద్ధంగా గౌరవించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు గురుస్వామి భక్తవత్సలం, ధర్మకర్త పీవీ.కృష్ణారావు పర్యవేక్షించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కాగా, అక్టోబర్ 2వ తేదీ గురువారం విద్యారంభ జ్ఞాన సరస్వతి అమ్మవారి సమక్షంలో ఉచితంగా అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించనున్నారు.

దుర్గాదేవి అలంకారంలో వాసవాంబ



అశ్వవాహనంపై దుర్గాదేవిగా అమ్మవారు

స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ)లో జరుగుతున్న నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 9వ రోజైన మంగళవారం దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు విశేష పూజలు అందుకున్నారు. ఉదయం వేద పారాయణం, మూలమంత్రహోమం, అభిషేకపూజల అనంతరం సాయంత్రం 6 గంటలకు ఆలయ మహామండపంలో దుర్గాదేవిని అశ్వవాహనంపై కొలువుదీర్చి దీపారాధన చేశారు. ఈ సందర్భంగా జనని గణేష్ భరతనాట్యం, తెలుగు తరుణి కళాకారుల భక్తిగీతాలు, సహన బృందం భక్తిగీతాలు, ఎం.పద్మలత వీణానాదం, అలరించాయి. అనంతరం భక్తులందరికీ ఎస్‌కేపీడీ ట్రస్టీలు ప్రసాదం పంపిణీ చేశారు. బుధవారం మహర్నవమి సందర్భంగా చండీ అలంకారం, గురువారం విజయదశమి రోజున మహిషాసుర మర్ధిని అలంకారం, రాత్రి 7 గంటలకు పార్వేట ఉత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవంతో నవరాత్రి పూజలు ముగియనున్నాయి. అక్టోబర్ 4 నుండి 12వ తేదీవరకు విడయాత్తి ఉత్సవం నిర్వహించనున్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

వేలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక విరుపాక్షిపురం చూలైమేడు ప్రాంతానికి చెందిన సుధాకర్ (35) తన ఇంట్లో మద్యం విక్రయిస్తున్నాడని బాగాయం పోలీసులకు సమాచారం అందింది. దీంతో, పోలీసులు ఆ ఇంట్లో తనిఖీలు చేపట్టి మద్యం స్వాధీనం చేసుకుని, సుధాకర్‌ను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

గుట్కా తరలిస్తున్న...



గుట్కా కేసులో అరెస్టయిన చిత్తూరు జిల్లా వాసులు

స్థానిక పిళ్లయార్ కుప్పం ప్రాంతంలో సీఐ విజయ్‌భాస్కర్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో వచ్చిన ఆంధ్ర రాష్ట్రం రిజిస్ట్రేషన్‌తో ఉన్న రెండు కార్లను ఆపి తనిఖీ చేయగా, ఒక్కో కారులో 150 కిలోల గుట్కా, హాన్స్ సహా పలు మాదకద్రవ్యాలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో కార్లలో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా గంగైపల్లెకి చెందిన సాధిక్ బాషా (33), మహ్మద్ అయాస్ హాన్సేస్ తదితరులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి జీవిత ఖైదు

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వృద్ధుడికి జీవిత ఖైదు విధిస్తూ కోయంబత్తూర్ పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది. కోవై మేట్టుపాళయం ప్రాంతానికి చెందిన 13 ఏళ్ల బాలిక తల్లిదండ్రులు పనులకు వెళ్లి రాత్రికి ఇంటికి వస్తుంటారు. దీంతో పాఠశాల సెలవు రోజుల్లో బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో 2019లో అదే ప్రాంతానికి చెందిన షేక్ బాలా, తల్లిదండ్రులు లేని సమయంలో ఇంట్లో ప్రవేశించి బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ విషయం బయటకు చెప్పొద్దని బాలికను బెదిరించారు. బాలిక కడుపు నొప్పితో బాధపడుతుండడంతో, తల్లి ఆమెను విచారించగా జరిగిన విషయం తెలిపింది. బాలిక మూడు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ వ్యవహారంపై బాలిక తల్లి పెరియనాయకన్‌పాళయం మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. విచారణ చేపట్టిన పోలీసులు, పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి షేక్ బాలాను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ అనంతరం నేరం నిరూపణ కావడంతో, షేక్ బాలాకు జీవిత ఖైదు, రూ.25 వేలు జరిమానా విధిస్తూ కోవై కోర్టు న్యాయమూర్తి భగవతి అమ్మాళ్ తీర్పు వెలువరించారు. అలాగే, బాధిత బాలికకు రూ.5 లక్షలు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు.

ఏనుగు దాడిలో వ్యక్తి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో ఏనుగు దాడిలో వ్యక్తి మృతిచెందాడు. ఊటీ సమీపం బొక్కాపురం ప్రాంతానికి చెందిన మాధన్ (42) సోమవారం సాయంత్రం వంట చెరకు కోసం సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అతను కట్టెలు సేకరిస్తున్న సమయంలో పొదల నుంచి వచ్చిన ఏనుగు అతనిపై దాడిచేసింది. అతని కేకలు విని చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని పెద్ద శబ్దాలు చేస్తూ ఏనుగును అడవిలోకి పంపారు. సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది, తీవ్రంగా గాయపడిన మాధన్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తాంబరంలో ఆటో డ్రైవర్ కిడ్నాప్, హత్య

● ఐదుగురు నిందితుల కోసం గాలింపు

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక తాంబరంలో పాత కక్షల కారణంగా ఒక ఆటో డ్రైవర్‌ను కొందరు కిడ్నాప్ చేసి హత్య చేయగా, ఈ కేసులో ఐదుగురు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తాంబరం శానిటోరియం దుర్గా నగర్‌కు చెందిన వినోద్ (26) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి మద్యం సేవించి ఆటోలో వుండగా, ఆ సమయంలో అక్కడకు వచ్చిన ఒక ముఠా వినోద్‌ను కిడ్నాప్ చేసి, వీజీఎన్ కాలనీకి తీసుకువెళ్లి మారణాయుధాలతో దాడి చేసి హత్య చేసింది. దీనిపై సమాచారం అందుకున్న తాంబరం పోలీసులు... హత్యాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదు చేసి చేపట్టిన ప్రాథమిక విచారణలో నాలుగు నెలల క్రితం ఆటో డ్రైవర్లతో వినోద్ గొడవ పెట్టుకున్నాడు. దీన్ని మనసులో పెట్టుకున్న మిగిలిన ఆటో డ్రైవర్లు ఈ హత్యకు పాల్పడివుంటారని భావిస్తూ ఆ ఐదుగురి ముఠా సభ్యుల కోసం గాలిస్తున్నారు.

ఈసీ తీరుకు నిరసనగా కాంగ్రెస్ సంతకాల సేకరణ



ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నేతలు

వేలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పిళ్లయార్ ఆలయ వీధిలో జిల్లా కాంగ్రెస్ ఓబీసీ విభాగం ఆధ్వర్యంలో 'నా ఓటు...నా హక్కు' అనే నినాదంతో కేంద్ర ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా సంతకాలు సేకరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ఆ విభాగం జిల్లా అధ్యక్షుడు లోకనాధన్ అధ్యక్షత వహించగా, నిర్వాహణ అధ్యక్షుడు పళినివేలు రాజన్ సంతకాల సేకరణ ప్రారంభించారు. కార్యక్రమంలో ఓబీసీ విభాగ కార్యదర్శి సావిత్రి, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రప్రకాశ్, ఎస్సీ, ఎస్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్ధరజన్, బాలకుమార్ గుణ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపు చట్టాలపై అవగాహన



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జస్టిస్ జయచంద్రన్, కలెక్టర్ ప్రతాప్ తదితరులు

తిరుత్తణి, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం ఉదయం ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలో లైంగిక వేధింపుల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మద్రాస్ హైకోర్టు ప్రోటోకాల్ న్యాయమూర్తి జస్టిస్ జయచంద్రన్, కలెక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో మహిళలపై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, అందులో తెలిసినవి కొన్నైతే, ఫిర్యాదు ఇవ్వడానికి భయపడి కేసుల వరకు రాకుండా ఉన్నవి మరెన్నోనని, భయపడి వెనుకడుగు వేస్తే అన్యాయాన్ని ప్రోత్సహించినవారమవుతామని, ధైర్యంగా ముందుకొచ్చి నిందితుడికి శిక్షపడేలా చేయాలని ఆయన విద్యార్థినులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు నియమించిన జెండర్ సెన్సిటిజేషన్ అండ్ ఇన్‌టర్నల్ కంప్లైంట్స్ కమిటీ (జీఎస్ఐసీసీ)సభ్యులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలు, కళాశాలలో పర్యటించి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నేరుగా కాకపోయినా ఆన్‌లైన్ ద్వారా అయినా ఫిర్యాదులు చేసే సౌకర్యాన్ని తీసుకొచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల ఉన్నతాధికారులు, కళాశాల నిర్వాహకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

12న పీజీ టీచర్ల రాతపరీక్ష

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో పోస్ట్‌గ్రాడ్యుయేట్ టీచర్లుగా పనిచేసేందుకు నిర్వహించే రాతపరీక్ష ఈ నెల 12వ తేది జరుగుతుందని ఉపాధ్యాయుల ఎంపిక బోర్డు (టీఆర్బీ) తెలిపింది. ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో పీజీ టీచర్లు, ఫిజికల్ డైరెక్టర్ (గ్రేడ్-1), కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్ (గ్రేడ్-1) సహా 1,996 పోస్టుల భర్తీకి జూలై 10వ తేది నోటిఫికేషన్ విడుదలైంది. అక్టోబరు 12వ తేది రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ జూలై 19న ప్రారంభమై ఆగస్టు 12వ తేది వరకు జరిగింది. ఈ నేపథ్యంలో, ప్రస్తుత విద్యా సంవత్సరం కొన్ని పాఠ్యాంశాల్లో మార్పులు కారణంగా పరీక్ష మూడు వారాలు వాయిదావేయాలంటూ పలువురు అభ్యర్థులు దాఖలుచేసిన పిటిషన్ విచారించిన మద్రాసు హైకోర్టు, రాతపరీక్షపై టీఆర్బీ నిర్ణయం తీసుకుంటుందని ఉత్తర్వులు జారీచేసింది. ఆ ప్రకారం, గత శనివారం నిర్వహించిన సమావేశంలో, నోటిఫికేషన్‌లో ప్రకటించిన విధంగా ఈ నెల 12న రాత పరీక్ష నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నట్లు టీఆర్బీ అధ్యక్షులు ఎస్.జయంతి తెలిపారు.

మోదీ స్ఫూర్తితో బీజేపీని ముందుకు తీసుకెళ్దాం

● పళ్లిపట్టు కార్యదర్శి కిరణ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

తిరుత్తణి, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో మంగళవారం ఉదయం బీజేపీ సమావేశం జరిగింది. పళ్లిపట్టు నార్త్ యూనియన్ బీజేపీ కార్యదర్శి కిరణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్రమోదీ పేరుమీద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆ ప్రాంతంలోని ప్రజలకు ఆయుష్మాన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పళ్లిపట్టు బీజేపీ నేతలు టీవీ.మునియప్పన్, పెరుమాళ్, రఘు, గోవిందస్వామి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం ప్రారంభం

వేలూరు, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాట్పాడిలోని ప్రభుత్వ మహిళా ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని వేలూరు కార్పొరేషన్ 1వ మండల కమిటీ అధ్యక్షులు పుష్పలత వన్నియరాజ మంగళవారం ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం సరళ అధ్యక్షత వహించగా, పథక అధికారి అన్నపూర్ణి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జూనియర్ రెడ్‌క్రాస్ సంఘం మాజీ జిల్లా ఆర్గనైజర్ జనార్ధనన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు థామస్, సభ్యులు మహేంద్రన్, బాలాజి, రూపన్, పాఠశాల మేనేజింగ్ కమిటీ అధ్యక్షురాలు సునంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాల్లో అవినీతి

● డాక్టర్ రాందాస్ ఆరోపణ

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రాల్లో అవినీతి రాజ్యమేలుతుందని పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ ఆరోపించారు. ఇదే విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కావేరీ డెల్టా ప్రాంతాల్లో ధాన్యం దిగుబడి అధికంగా ఉందని, ఈ కారణంగా మధ్యవర్తుల బెడద ఎక్కువైందన్నారు. అదేసమయంలో ప్రభుత్వ ధాన్యం సేకరణ కేంద్రాల్లో సిబ్బంది, మధ్యవర్తులు కుమ్మక్కై అవినీతికి తెరలేపారని ఆయనారోపించారు. రైతులు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ధాన్యం సేకరణ కేంద్రాల పనితీరును మెరుగుపరచాలని ఆయన కోరారు.

కరూర్ ఘటనపై రాజకీయ లబ్ధి చూడొద్దు

● ఎంపీ కనిమొళి

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కరూర్ తొక్కిసలాట దుర్ఘటనను అడ్డుపెట్టుకుని ఏ రాజకీయ పార్టీ రాజకీయ లబ్ధికోసం పాకులాడొద్దని డీఎంకే మహిళా నేత, తూత్తుకుడి ఎంపీ కనిమొళి విజ్ఞప్తి చేశారు. ఇదే విషయంపై ఆమె మంగళవారం మాట్లాడుతూ, తొక్కిసలాట జరిగిన సమయంలో అత్యంత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆ సమయంలో బాధితులను ఆదుకునేందుకే మంత్రులు, అధికారులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారన్నారు. దీన్ని మరో కోణంలో చూడొద్దని కోరారు. అలాగే, సీఎం స్టాలిన్ కూడా హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని బాధితులను పరామర్శించడంతో పాటు వాస్తవ పరిస్థితులను తెలుసుకునేందుకు నిజ నిర్ధారణ కమిటీని కూడా ఏర్పాటు చేశారని ఆమె గుర్తు చేశారు. వీటన్నింటిని మించి మృతులు, బాధిత కుటుంబాలకు పరిహారం కూడా ప్రకటించారన్నారు. ఇలాంటి సంఘటన జరిగివుండకూదన్నారు. జరగరానిది జరిపోయిందని, దీన్ని అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి కోసం వెంపర్లాడరాదని ఆమె పేర్కొన్నారు.

విజయ్‌ని అరెస్ట్ చేయొద్దు

● ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): కరూర్ రోడ్‌షోలో 41 మంది మృతిచెందిన వ్యవహారంలో తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ వద్ద విచారణ జరపాలని, అయితే ఆయన్ని అరెస్ట్ చేయవద్దని ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో పేర్కొన్నారు. ఎగ్మూర్‌లోని ఎండీఎంకే కార్యాలయంలో మంగళవారం వైగో మీడియాతో మాట్లాడుతూ, రాజకీయ నేతలు పాల్గొనే బహిరంగ సభలు, రోడ్‌షోలకు వెళ్లే ప్రజలకు ప్రమాదం జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా సభలకు తరలివచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత నాయకులదేనన్నారు. కరూర్ దుర్ఘటన కుట్రకోణంలో చూడరాదని, మనుషుల ప్రాణాలతో ఎవ్వరూ చెలగాటమాడరని ఆయన పేర్కొన్నారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ మానవతా దృష్టితో కరూర్ బాధితులను పరామర్శించి బాధ్యతతో వెళ్లారన్నారు. బాధితులను పరామర్శించేందుకు విజయ్ కరూర్ వెళ్లకపోవడాన్ని తాను నేరంగా భావించలేదని, అయితే ఈ విషాద సంఘటనతో ఆయన గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనారోగ్యం కారణంగా తాను కరూర్‌కు వెళ్లలేకపోయానని వైగో వివరించారు.

మెట్రో వాటర్ కొత్త నిబంధనలు

● ప్రజలపై అదనపు భారం

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): మెట్రో వాటర్ బోర్డు కొత్తగా అమల్లోకి తెచ్చిన నిబంధనల కారణంగా ప్రజలపై అదనపు భారం పడుతుందని అన్నాడీఎంకే కౌన్సిల్ కమిటీ కార్యదర్శి డాక్టర్ కే.కార్తిక్ అభిప్రాయపడ్డారు. సోమవారం జరిగిన జీసీసీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కొత్తగా మెట్రో వాటర్ కనెక్షన్ తీసుకునే నగర ప్రజలకు మీటర్లు సొంతంగా కొనుగోలు చేసుకోవాలన్న నిబంధన పెట్టారని, దీనివల్ల అదనపు భారం పడుతుందన్నారు. గతంలో కనెక్షన్లు తీసుకున్న వారికి ఇలాంటి నిబంధన లేదని, ఈ నిబంధనను తొలగించాలని ఆయన కోరారు.





చెన్నై షావుకారుపేటలోని తేరాబంద్ జైన్ విద్యాలయ పాఠశాలలో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్నిప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించడం, ప్రమాదరహిత దీపావళి జరుపుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

విజయవంతంగా 'ఆధునిక తెలుగు కవులు - రచనలు'పై సదస్సు



విద్యార్థినికి బహుమతి ప్రదానం

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టాభిరాంలోని హిందూ కాలేజీ తెలుగు శాఖ, తెలుగు భాషా సమితి ఆధ్వర్యంలో మంగళవారం 'ఆధునిక తెలుగు కవులు - వారి రచనలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సెప్టెంబరులో జరిగిన మహాకవి గురజాడ, కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా జయంతులను పురస్కరించుకుని ఈ సదస్సు ఏర్పాటు చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా ఆ కాలేజీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షురాలు డాక్టర్.పి.సీతమ్మ హాజరుకాగా 16 మంది విద్యార్థులు పత్రసమర్పణ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇలాంటి అరుదైన అవకాశాలు వచ్చినపుడు విద్యార్థులు అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్ స్వాగతం పలుకగా, ప్రధాన అధ్యాపకులు డాక్టర్ జి.కల్విక్కరసి అధ్యక్షోపన్యాసం చేశారు. మహాకవులు, వారి రచనలు గురించి ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో ఆనందంగా ఉందని గౌరవ అతిథి, కళాశాల సంచాలకుడు డాక్టర్ ఎన్.రాజేంద్ర నాయుడు అన్నారు. ఇలాంటి సదస్సులను విద్యార్థులు ఉపయోగించుకుని, పత్ర సమర్పణ చేయాలని, ఇలాంటి కార్యక్రమాల వల్ల తెలుగు సాహిత్యాలను విశ్వవ్యాప్తం చేయాలని కాలేజీ తెలుగు శాఖ సహాయాచార్యులు డాక్టర్ తుమ్మపూడి కల్పన పిలుపునిచ్చారు. ఈ సదస్సులో కాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకార సంఘ ఎన్నికలను నవంబర్ 27లోగా పూర్తిచేయాలన్న హైకోర్టు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా నిర్వహించని చెన్నై న్యాయవాదుల సహకార సంఘ ఎన్నికలను నవంబర్ 27వ తేదీలోగా పూర్తిచేయాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సీనియర్ న్యాయవాది వి.ఆనంద్ మద్రాస్ హైకోర్టులో 2018లో దాఖలు చేసిన పిటిషన్‌లో, న్యాయవాదుల సహకార సంఘానికి ఏళ్లతరబడి ఎన్నికలు నిర్వహించని కారణంగా సంఘం, క్యాంటీన్ ప్రస్తుతం ప్రత్యేక అధికారి ఆధీనంలో ఉన్నాయని, ఎన్నికలు వెంటనే నిర్వహించేలా ఆదేశించాలని కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం న్యాయవాదుల సహకార సంఘ ఎన్నికల నిర్వహణకు ఓ ప్రత్యేక కమిటీ నియమించి ఎన్నికల అధికారి ద్వారా ఓటర్ జాబితా పరిశీలించాలని ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల నిర్వహణ కమిటీలో చెన్నై హైకోర్టు న్యాయవాదుల సంఘం, మద్రాస్ బార్ అసోసియేషన్, మహిళా సంఘ నిర్వాహకులు ఓటర్ జాబితాను సవరించింది. అయినప్పటికీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో న్యాయవాది ఆనంద్ మళ్లీ మద్రాస్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ న్యాయమూర్తి వి.లక్ష్మీనారాయణన్ ముందుకు సోమవారం విచారణకు వచ్చింది. అప్పుడు పిటిషనర్ తరుపున మద్రాస్ హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జి.మోహన్‌కృష్ణన్, ప్రభుత్వ ప్రత్యేక ప్లీడర్ గీతా తామరైసెల్వన్ హాజరై వాదించారు. ఈ వాదనల అనంతరం అక్టోబర్ 25వ తేదీలోగా ఓటరు జాబితా పరిశీలించి ఎన్నికల అధికారికి సమర్పించాలని, నవంబర్ 27వ తేదీలోగా న్యాయవాదుల సహకార సంఘ ఎన్నికలు పూర్తిచేయాలని ఆదేశించారు.

సెంగోట్టయ్యన్ మద్దతుదారులకు ఈపీఎస్ షాక్

అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ మంత్రి కేఏ సెంగోట్టయ్యన్ మద్దతుదారుల్లో 40 మందిని పార్టీ పదవుల నుంచి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి తొలగించారు. ఈపీఎస్, సెంగోట్టయ్యన్‌ల మధ్య ఆధిపత్యపోరు తలెత్తింది. దీంతో సెంగోట్టయ్యన్ మద్దతుదారులను పార్టీ పదవుల నుంచి ఈపీఎస్ తొలగిస్తూ వస్తున్నారు. ఇప్పటికే ముఖ్య నేతలైన కురింజినాథన్, ఈశ్వరమూర్తి, సుబ్రమణియం, మాజీ ఎంపీ సత్యభామ సహా మొత్తం 13 మంది ఉన్నారు. తాజాగా మరో 40 మందిని పార్టీ పదవుల నుంచి తొలగిస్తూ ఈపీఎస్ ఉత్తర్వులు జారీచేశారు.

పుదియ తమిళగం సహా పది రాజకీయ పార్టీలకు ఈసీ నోటీసు

పెరంబూర్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పుదియ తమిళగం సహా పది పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) నోటీసులు జారీ చేసింది. ఈసీలో నమోదుచేసుకున్న రాజకీయ పార్టీలు ప్రతి సంవత్సరం ఆడిట్ చేయబడిన ఖాతాలు సమర్పించాల్సి ఉంది. కానీ, ఈసీలో నమోదుచేసుకున్న ఆలిండియా ఎంజీఆర్ మక్కల్ మున్నేట్ర కళగం, కామరాజ్ నేషనల్ కాంగ్రెస్, మక్కల్ శక్తి తదితర పార్టీలు ఆడిట్ చేసిన ఖాతాలు దాఖలుచేయలేదు. అలాగే, మై ఇండియన్ పార్టీ, పుదియ తమిళగం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా-శివరాజ్, తమిళగ మున్నేట్ర కాంగ్రెస్, వళమాన తమిళ పార్టీ సహా 10 రాజకీయ పార్టీలు 2021 నుంచి ఆడిట్ చేసిన ఖాతాలు నిర్ణీత వ్యవధిలోగా ఈసీకి సమర్పించలేదు. ఈ కారణంగా ఈ పార్టీలను నమోదు చేసిన పార్టీల జాబితా నుంచి తొలగించాలని ఈసీ నిర్ణయించింది. అంతకు ముందు, ఆయా పార్టీల అభిప్రాయం తెలుసుకోవాలని పుదియ తమిళగం సహా 10 పార్టీలకు ఈసీ నోటీసులు జారీచేసింది. ఎటువంటి స్పందన రాకపోతే ఆ పార్టీలకు ఎలాంటి అభిప్రాయం లేదని భావించి, నమోదుచేయబడిన పార్టీల జాబితా నుంచి తొలగించే అవకాశముందని ఈసీ వర్గాల సమాచారం.

సోలార్ పవర్ ఈవీ-చార్జింగ్ స్టేషన్ ఆవిష్కరణ



అడయార్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈ-మొబిలిటీలో భాగంగా ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) తాజాగా సోలార్ పవర్ ఈవీ చార్జింగ్ స్టేషన్ ఆవిష్కరించింది. 2009 నుంచి గ్రీన్ ఎనర్జీ ద్వారా విద్యుత్ శక్తి అవసరాల కోసం కావాల్సిన విద్యుత్‌ను పునరుత్పాదక ఇంధన స్వీకర, నికర జీరో కార్బన్ ఉద్గారాలను సాధిస్తూ ముందుకుసాగిపోతోంది. దీనికి కొనసాగింపుగా ఐసీఎఫ్ షెల్ అండ్ పవర్ డివిజన్‌కు చెందిన అడ్మినిస్టేటివ్ భవనాల పార్కింగ్ ప్రాంతంలో ఈవీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసింది. దీనికి అవసరమైన విద్యుత్‌ను రూఫ్‌టాప్ సోలార్ పవర్ ప్లాంట్ ద్వారా పొందుతుంది. షెల్, ఫర్నిషింగ్ విభాగాల్లో ఒక్కొక్కటి మూడు ఎలక్ట్రిక్ ద్విచక్రవాహనాలకు ఒకేసారి చార్జింగ్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇది ఓవర్, లో ఓల్టేజ్, షార్ట్ సర్క్యూట్ ప్రొటెక్షన్ సహా అధునాతన భద్రతా ప్రమాణాలతో అమర్చినట్టు ఐసీఎఫ్ పీఆర్వో ఎంజీ శంకర్ విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.



సత్తువాచేరి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బధిరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం దివ్యాంగుల ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి



'వీర తమిళచ్చి' ఆడియో విడుదల కార్యక్రమం

సినీ ప్రముఖుల చేతులమీదుగా

'వీర తమిళచ్చి' ఆడియో విడుదల

మగిళిని కలైక్కూడం పతాకంపై శారద మణివణ్ణన్, మగిళిని సంయుక్తంగా నిర్మించగా, నూతన దర్శకుడు సురేష్ భారతి రూపొందించిన 'వీర తమిళిచ్చి' మూవీ ఆడియో విడుదల కార్యక్రమం పలువురు కోలీవుడ్ ప్రముఖుల సమక్షంలో జరిగింది. తమిళ సినీ దర్శకుల సంఘ అధ్యక్షుడు ఆర్‌వీ ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి, సినీ దర్శకుడు పేరరసు, రాజకుమరన్, విజయ్ శ్రీ, బడా నిర్మాత అన్బుచెళియన్ తదితరులున్నారు. ఈ చిత్రంలో సంజీవ్ వెంకట్, ఇలయ, సుష్మిత సురేష్ హీరోహీరోయిన్లుగా నటించగా, ఇతర పాత్రల్లో దివంగత మారిముత్తు, వేల రామమూర్తి, కె.రాజన్, మీసై రాజేంద్రన్, జయం గోపి తదితరులు నటించారు. నిర్మాతల్లో ఒకరైన మణివణ్ణన్ మాట్లాడుతూ, 'తమిళ మహిళల ధైర్యసాహసాలను తెలియజేసే విధంగా నిర్మించిన ఈ సినిమాను త్వరలో విడుదల చేస్తాం. ప్రేక్షకులు ఇలాంటి సినిమాలను చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను' అని కోరారు. చిత్ర దర్శకుడు సురేష్ భారతి మాట్లాడుతూ, ' భవన నిర్మాణ కార్మికుడి నుంచి సినీ దర్శకుడి స్థాయికి తీసుకొచ్చింది నా భార్యా పిల్లలే. గత ఐదేళ్ళుగా ఈ ప్రాజెక్టు కోసం పనిచేశాను. రూ.60 లక్షల బడ్జెట్‌తో నిర్మించాలని ప్లాన్ చేయగా, నిర్మాణం పూర్తయ్యే సరికి రూ.3.50 కోట్లకు చేరింది. ఈ సినిమా క్లైమాక్స్ పూర్తి భిన్నంగా ఉంటుంది. ఖచ్చితంగా ప్రేక్షకులు ఆదరించి, విజయం చేకూరుస్తారని కోరారు. ఆ తర్వాత అతిథులతో పాటు చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.

చిత్రజ్యోతి

నవనీత్ సుందర్ 'ఒరు మాలై నేరత్తిల్'

ప్రముఖ సంగీత కళాకారుడు నవనీత్ సుందర్ తాజాగా 'ఒరు మాలై నేరత్తిల్' అనే ప్రైవేట్ ఆల్బమ్ రూపొందించి, తాజాగా రిలీజ్ చేశారు. ఈ ఆల్బమ్‌ను ఒకేసారి తమిళం, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో రూపొందించారు. తమిళం, హిందీ భాషల్లో గేయ రచన నవనీత్ సుందర్ చేయగా, తెలుగులో క్రాంతి వడ్లూరి, కన్నడంలో దీప్తి నటరాజన్ సాహిత్యం అందించారు. రొమాంటిక్ సాంగ్‌కు అద్భుతమైన స్వరాలను సమకూర్చి భారీ హంగులతో, ఏఐ విజువల్స్‌తో రూపొందించి, భారీ స్థాయిలో ఆల్బమ్‌ను నవనీత్ సుందర్ రిలీజ్ చేశారు. ఏఐ టెక్నాలజీని ఉపయోగించి ప్రేమికుల స్పష్టమైన ముఖ కవళికలు, కళాకారుడి అద్భుతమైన విజువల్స్ ముచ్చటగా ఉంటాయని ఆయన అంటున్నారు.

'ఒరు మాలై నేరత్తిల్' ఆల్బమ్ సాంగ్ రిలీజ్ దృశ్యం



ధనుష్‌కు ఆకలి బాధ తెలుసు

● అరుణ్ విజయ్



అరుణ్ విజయ్ - ధనుష్

హీరో ధనుష్‌కు ఆకలి విలువ బాగా తెలుసని, 'ఇడ్లీ కడై' సినిమా షూటింగ్ సమయంలో ఆయన నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నానని హీరో అరుణ్ విజయ్ అంటున్నారు. ధనుష్ దర్శకత్వంలో తాజాగా రూపొందిన చిత్రం 'ఇడ్లీకడై'. బుధవారం విడుదలకానుంది. ఈ సినిమా ప్రమోషన్ వేడుకల్లో ధనుష్ మాట్లాడుతూ, ఈ చిత్రంలో అరుణ్ విజయ్, ఇడ్లీ దుకాణాలే హీరోలని పలుమార్లు చెప్పారు. దీనిపై అరుణ్ విజయ్ స్పందిస్తూ, 'ఈ సినిమా షూటింగ్ మదురైలో జరిగింది. లొకేషన్‌లో వ్యాయామం చేసేందుకు ఎలాంటి సౌకర్యాలు లేవు. దీంతో చెన్నై నుంచి వ్యాయామానికి అవసరమైన పరికరాలను తెప్పించుకుని వ్యాయామం చేసి షూటింగుకు వెళ్ళేవాళ్ళం. షూటింగ్ తర్వాత మదురైలో తిరుగుతూ రోడ్డు పక్కన ఉండే టిఫన్ దుకాణాల్లో రుచికరమైన ఆహారం తినేవాళ్ళం. ధనుష్ శాకాహారి. నేను మాత్రం అన్ని రకాలు తినేవాడిని. అయితే ధనుష్‌కు ఆకలి విలువ బాగా తెలుసు. అందుకే భోజనం వేళకు షూటింగ్ ఆపి ప్రతి ఒక్కరికీ భోజనం పెట్టేవారు. ఆయనతో సాగిన జర్నీలో అనేక విషయాలు నేర్చుకున్నాను' అని పేర్కొన్నారు. కాగా, 'ఇడ్లీకడై' చిత్రంలో ధనుష్, అరుణ్ విజయ్, నిత్యామేనన్, షాలిని పాండే, రాజ్‌కిరణ్ నటించగా, నిర్మాత ఆకాష్ భాస్కరన్‌తో కలిసి హీరో ధనుష్ సొంతంగా నిర్మించారు.

నటి ఓవియాను టార్గెట్ చేసిన విజయ్ ఫ్యాన్స్



యువ హీరోయిన్ ఓవియాను అగ్రహీరో విజయ్ అభిమానులు టార్గెట్ చేశారు. ఆమెను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నారు. దీంతో నటి ఓవియా తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. అయితే, ఓవియాను విజయ్ ఫ్యాన్స్ లక్ష్యంగా చేసుకోవడానికి కారణం లేకపోలేదు. ఇటీవల కరూర్‌లో టీవీకే అధ్యక్షుడు హోదాలో విజయ్ నిర్వహించిన ప్రచార సభలో తొక్కిసలాట కారణంగా 40 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఈ విషాదకర ఘటనపై కోలీవుడ్‌కు చెందిన అనేక మంది ప్రముఖులు స్పందించారు. కానీ, నటి ఓవియా మాత్రం ఒక అడుగు ముందుకేసి... ఈ ఘటనకు కారణమైన విజయ్‌ను తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. 'అరెస్ట్ విజయ్' అంటూ ఓవియా తన ఇన్‌స్టాఖాతాలో పోస్ట్ చేశారు. ఇది విజయ్ అభిమానులకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. దీంతో ఆమెను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర పదజాలంతో దూషిస్తూ కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు విజయ్ ఫ్యాన్స్‌ను టీవీకే నేతల్లో ఏ ఒక్కరు కూడా నియంత్రించకపోవడం గమనార్హం.

సమానత్వానికి ప్రతీక 'బతుకమ్మ'

● చెన్నై తెలంగాణ సంఘ వేడుకల్లో వక్తలు



వేదికపై నిర్వాహకులతో జీసీసీ జోనల్ చైర్మన్ శ్రీరాములు



సద్దుల బతుకమ్మ వేడుకల్లో తెలంగాణ ఆడపడుచులు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలకు అద్దంపడుతూ, కులమతాలకు అతీతంగా నిర్వహించిన బతుకమ్మ పండుగ సమానత్వానికి ప్రతీక అని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) జోనల్ చైర్మన్ పి.శ్రీరాములు పేర్కొన్నారు. రాజధాని నగరం చెన్నైలో నివసిస్తున్న తెలంగాణ ప్రజలు సంప్రదాయబద్ధంగా చేపట్టిన ఎంగిలిపూల, సద్దుల బతుకమ్మ సంబురాలు సోమవారం రాత్రితో ముగిశాయి. షావుకారుపేట అమ్మన్‌కోవిల్‌వీధిలోని జీటీటీవీ పాఠశాల ప్రాంగణంలో చెన్నై తెలంగాణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో నగరం, శివారు ప్రాంతాల్లో నివసించే తెలంగాణ వాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేదిక ప్రాంగణంలో వివిధ రకాల పూలతో బతుకమ్మను ఏర్పాటుచేసిన మహిళలు నృత్యాలతో సందడి చేశారు. చెన్నై తెలంగాణ సంఘం నిర్వాహకులు బతుకమ్మ పండుగ సంబరాలను పర్యవేక్షించి అందరికీ ప్రసాదాలు పంపిణీ చేశారు. ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పి.శ్రీరాములు నిర్వాహకులను అభినందించారు. ఆత్మీయ అతిథులుగా డీఎంకే నేతలు కేఆర్.అపరంజి, హరికుమార్, ఎస్.మురళి పాల్గొన్నారు. చెన్నై తెలంగాణ సంఘం నిర్వాహకులు, కార్యవర్గ కమిటీ సభ్యులు, అన్ని కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. చెన్నై తెలంగాణ సంఘం గౌరవ అధ్యక్షుడు డి.అంజయ్య, అధ్యక్షుడు ముప్పిడి పరశురాం, సెక్రటరీ చిత్తలూరి శ్రీనివాస్, కోశాధికారి ఎస్‌కే షఫీ, నిర్వాహకులు సీహెచ్ నరసింహ, ఎస్.అశోక్, సి.అంజయ్య, సీహెచ్.గిరి, ఎం.రమేష్, పీఎస్.శ్రీనివాస్, కమిటీ కార్యవర్గ సభ్యులు, తెలంగాణ కుల సంఘాల నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గరుడ వాహనంపై విహరించిన వేంకట ముడయాన్



గరుడ వాహనంలో ఊరేగుతున్న స్వామివారు - విజయవాడ కళాకారుల కోలాటం



ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొడంగియూర్ వెంకటేశ్వరనగర్‌లోని సిద్ధి వినాయక శ్రీనివాస వేంకట ముడయాన్ తిరుకోవిల్ సేవార్థిగల్ సంఘం ఆధ్వర్యంలో 11వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ నెల 27వ తేదీ ఉదయం 8 గంటలకు అంకురార్పణం, ధ్వజారోహణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో పలు ప్రాంతాల కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వామివారికి కళానీరాజనం సమర్పించారు. టి.బాబు, జె.అశోక్‌కుమార్, శివ కుటుంబాల ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన శ్రీను మాస్టర్-హరి శ్రీనివాస బృందం ప్రదర్శించిన కోలాటం, నృత్యాలు అలరించాయి. వెంకటేశ్వరనగర్ వీధులు, ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. శ్రీవారికి నిర్వహిస్తున్న ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్న భక్తులందరికీ ఆలయ నిర్వాహకులు ఎస్.రవిచంద్రన్, బోడి శ్రీనివాసులు, బీహెచ్.శ్రీనివాస్, ఎన్.జగన్నాథన్, బీవీఆర్.భాస్కర్, ఆర్.మోహనకృష్ణన్, జి.భాస్కర్, కోడి భావనారాయణ, పి.సంపత్‌కుమార్, జె.విజయ తదితరులు ప్రసాదాలు పంపిణీ చేశారు.



చెన్నై అన్నానగర్‌లో వ్యాపారవేత్త కృష్ణన్ నివాసంలో అందరినీ ఆకట్టుకుంటున్న బొమ్మల కొలువు

అరుణ శ్రీనాథ్ నివాసంలో ఘనంగా బొమ్మల కొలువు



బొమ్మల కొలువులో అరుణ శ్రీనాథ్ కుటుంబ సభ్యులు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని జవహర్‌నగర్ మూడో మెయిన్‌రోడ్డులోని ప్రముఖ గాయని అరుణ శ్రీనాథ్ నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో దశావతారాలు, అష్టలక్ష్ములు, రామాంజనేయుల మైత్రి, శ్రీరామ పట్టాభిషేకం, తిరుమల బ్రహ్మోత్సవాలు, కుంభకర్ణుడి నిద్ర సెట్, వివాహం, రిసెప్షన్, షష్టిపూర్తి అలంకరణ, విలేజ్ సెట్‌తో పాటు సంగీత విద్వాంసులు త్యాగరాజు, ముత్తుస్వామి దీక్షితులు, శ్యామశాస్త్రి తదితర విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. అదేవిధంగా అరుణ శ్రీనాథ్ వేస్ట్ మెటీరియల్స్‌తో స్వయంగా తయారుచేసిన బొమ్మలెన్నో ఈ ప్రదర్శనలో కొలువుదీర్చడం విశేషం.



బొమ్మల కొలవులో పూర్ణిమ

కుంభమేళా నమూనాతో...

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జవహర్ నగర్‌లోని పూర్ణిమ మన్నారు నివాసంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంటోంది. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో కుంభమేళా సెట్‌లతో పాటు వివిధ రూపాల్లో అమ్మవార్లను కొలువుదీర్చారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా దసరా పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంట్లో బొమ్మల కొలువు ఏర్పాటు చేయడం ఆనవాయితీగా మారిందని, ఈసారి కుంభమేళా సెట్ ఏర్పాటు చేశామన్నారు. 12 యేళ్లకు ఒకసారి వచ్చే ఈ ఘట్టాన్ని చెన్నైవాసులు వీక్షించాలనే ఆలోచనతో కుంభమేళ సెట్‌ను కూడా ఈ బొమ్మల కొలువులో ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

ఘనంగా పద్మశ్రీ కేజీ సక్సేనా 113వ జయంతి

అడయార్, సెప్టెంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదంబాక్కంలో హోమియోపతి వికాస్ దివస్‌ను పురస్కరించుకుని పద్మశ్రీ కేజీ సక్సేనా 113వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐఐహెచ్‌పీ తమిళనాడు విభాగం జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎస్‌ఆర్ జయకుమార్‌కు చెందిన మదన్ హోమియో క్లినిక్‌లో జరిగిన ఈ వేడుకల్లో ఐఐహెచ్‌పీ అధ్యక్షుడు (పుదుచ్చేరి యూటీ) డాక్టర్ ఎం.ప్రకాష్ రావు ముఖ్య అతిథిగా, ఐఐహెచ్‌టీ తమిళనాడు విభాగం అధ్యక్షుడు డాక్టర్ కొల్లిరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కేజీ సక్సేనా జీవిత చరిత్రపై కొల్లిరాజు ప్రసంగించారు. సాయిరామ్ హోమియోపతి మెడికల్ కాలేజీకి చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ మటారియా విభాగాధిపతి డాక్టర్ జి.నాగేంద్రబాబు పొల్గొని వైరల్ వ్యాధులు, వాసన్ ఐ కేర్ డైరెక్టర్ డాక్టర్ పీబీ కౌషిక్ వివిధ రకాల నేత్ర సంబంధిత వ్యాధులపై ప్రసంగించారు. వీరితో పాటు వివిధ విభాగాలకు చెందిన పలువురు వైద్య నిపుణులు కీలకాంశాలపై ఉపన్యసించారు. ఇందులో 40 మంది వైద్యులతోపాటు వెంకటేశ్వర హోమియోపతి మెడికల్ కాలేజీ వైద్యులు పాల్గొన్నారు.



జయంతి వేడుకల్లో పాల్గొన్న వైద్యులు, విద్యార్థులు



కోయంబేడు మార్కెట్లో అమ్మకాలకు పండ్లు

గుమ్మడికాయలు

అరటి పిలకలు

స్థానిక ప్యారీస్‌లో ఫ్లవర్ బజార్‌లో కొనుగోలుదారుల రద్దీ

కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న సంత

బొరుగులు

పూలను తీసుకెళ్తున్న వ్యాపారి

జోరుగా విక్రయాలు

పెరిగిన పూజా సామగ్రి ధరలు

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): ఆయుధ పూజ, విజయదశమి పండుగల్లో పూజ కోసం వినియోగించే పూలు, పండ్లు, బొరుగులు, అటుకులు సహా మామిడి, అరటి, గుమ్మడి తదితరాల ధరలు ఈ ఏడాది కూడా రెండింతలు పెరిగాయి. అయినప్పటికీ పూజకు అవసరమైన సామగ్రిని ప్రజలు తమ శక్తికి తగ్గట్టుగా కొనుగోలు చేస్తున్నారు. బుధవారం ఆయుధపూజ కావడంతో పూల ధరలకు రెక్కలొచ్చాయి. పది రోజుల క్రితం ఒక కిలో రూ.700 ధర పలికిన మల్లెపూలు ప్రస్తుతం రూ.1,200 నుంచి రూ.1700 వరకు విక్రయిస్తున్నారు. చామంతులు రూ.200, సంపంగి రూ.350, కనకాంబరాలు కిలో రూ.1000, చాక్లెట్ రోజ్ రూ.340, పన్నీర్ రోజ్ రూ.200, తులసాకుల కట్ట రూ.30కు విక్రయిస్తున్నారు. అలాగే దిష్టి గుమ్మడి కాయలు, నిమ్మపండ్లు, ఆపిల్, జామ, అరటిపిలకలు, కొబ్బరి తోరణాలు, వెలగపండ్లు, టెంకాయలు, తమలపాకులు, చెరుకు గడలు, పసుపుకొమ్ముల, బొరుగులు, అటుకులు, బెల్లం, తాటి కలకండ ధరలు కూడా పెరిగాయని వ్యాపారులు తెలిపారు.

బస్సులు, రైళ్లలో పెరిగిన రద్దీ...

పండుగను సొంతూళ్లలో జరుపుకునేందుకు నగరం నుంచి పెద్దసంఖ్యలో పయనమవుతున్న వారితో బస్సులు, రైళ్లలో రద్దీ బాగా పెరిగింది. ప్రయాణికుల సౌకర్యార్థం కీలంబాక్కం నుండి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, కోవై, నాగర్‌కోవిల్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాలకు స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) 400లకు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతుంది. అదేవిధంగా కోయంబేడు, మాధవరం నుండి 200 లకు పైగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. మరోవైపు సెంట్రల్, ఎగ్మూర్, తాంబరం, పెరంబూర్ రైల్వేస్టేషన్ల నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాలు, పొరుగురాష్ట్రాలకు నడుపుతున్న రైళ్లలో ప్రయాణికుల రద్దీ పెరిగింది. వరుస సెలవుల కారణంగా ప్రభుత్వ రవాణా సంస్థలు అదనంగా 2,900ల బస్సులు నడపనున్నాయి. ఇప్పటివరకు 1.10 లక్షల మందికి పైగా సొంతూళ్లకు బయలుదేరివెళ్లారు. అదేవిధంగా సెంట్రల్, ఎగ్మూర్ రైల్వేస్టేషన్లనుండి సుమారు 3 లక్షల మందికి పైగా వెళ్లినట్లు అధికారులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు కాంగ్రెస్ అండ

● ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్



బాధితులను పరామర్శిస్తున్న కేసీ వేణుగోపాల్

ప్యారీస్, సెప్టెంబర్ 30 (ఆంధ్రజ్యోతి): కరూర్ దుర్ఘటనలో 41 మందిని కోల్పోయిన కుటుంబాలకు కాంగ్రెస్ అండగఆ ఉంటుందని ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)ప్రధాన కార్యదర్శి కేసీ.వేణుగోపాల్ పేర్కొన్నారు. టీవీకే అధ్యక్షుడు కరూర్‌లో శనివారం సాయంత్రం నిర్వహించిన రోడ్‌షోలో జరిగిన తొక్కిసలాటలో 41 మంది మృతిచెందగా పలువురు గాయపడిన విషయం తెలిసిందే. బాధిత కుటుంబాలను మంగళవారం కలిసి ఓదార్చిన వేణుగోపాల్ కాంగ్రెస్ ప్రకటించిన ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట ఘటన ఊహించని ఘోరప్రమాదమేనని, దీనిని రాజకీయంగా చూడొద్దని, తాము రాజకీయంగా కాకుండా బాధితులను ఓదార్చేందుకే వచ్చామన్నారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నిత్యం తమిళ ప్రజలతో సన్నిహితంగా ఉండాలని, తమిళనాడులో అభివృద్ధి జరగాలని కోరుకుంటుంటారని తెలిపారు. ఘటన జరిగిన రోజే ఆయన విజయ్‌కు ఫోన్ చేసి మాట్లాడినట్లు ఆయన తెలిపారు. ఇదిలా వుండగా, ఢిల్లీ నుంచి సోమవారం ఉదయం కోవై విమానాశ్రయానికి వచ్చిన వేణుగోపాల్ అక్కడినుంచి కారులో కరూర్‌కు వెళ్లి తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఆ తర్వాత ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. ఆయనతో పాటు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ)అధ్యక్షుడు సెల్వపెరుంతగై, ఎంపీలు జ్యోతిమణి, విజయ్ వసంత్ తదితరులు బాధితులను పరామర్శించారు.